


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

పార్వతీశం ఆశ్చర్య పోయాడు శేషు చెప్పిన విషయం విని.

"నీకు నిజంగానే సైన్యం లోకి పోవాలని ఉందా? దేశ సేవకు ఎన్నో మార్గాలున్నాయి కదా!"

"నాకు నచ్చిన మార్గం ఇదే మావయ్యా. సరిహద్దుల్లో నిల్చుని అవసరమైతే శత్రు సైన్యంతో పోరాడి దేశమాతకు సేవ చెయ్యటం అనేది తలచుకోగానే నా రక్తం ఉరకలెత్తుతుంది, నన్ను ఆపకండి." అన్నాడు శేషు.

"సరే ముందు నువ్వు ఎంపికవ్వు" అన్నాడు పార్వతీశం.అదే అంగీకారంగా తీసుకుని పొంగిపోయాడు శేషు. మామయ్య ఆ మాటంటే ఒప్పుకున్నట్టే అని వాడికి తెలుసు

★★★★★

దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్వతంత్ర పోరాటంలో పాల్గొని, గుర్తింపు పొందిన వారిలో చాలా మంది తరువాతి కాలంలో జరిగిన ఎన్నికలలో నిలబడి ప్రభుత్వంలో భాగస్వాములైతే, మరింకెంతో మంది వారికి మద్దతు నిచ్చేవారయ్యారు. ఇంకొందరు కనీసం స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న వారికి ప్రభత్వం ఇచ్చే పింఛను కూడా సంపాదించుకోలేని వారయ్యా రన్నది వేరేమాట.

దేశ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బాబు రాజేంద్ర ప్రసాద్ మొదటి రాష్ట్రపతి అయితే, జవహర్లాల్ నెహ్రూ మొదటి ప్రధాని అయ్యారు. ఇది భారతీయులందరికీ ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇంతటి ఆనందంలోనూ అఖండ భారతాన్ని హిందూ, ముస్లిం ప్రాతిపదిక మీద భారతదేశం, పాకిస్థాన్ గా బ్రిటిష్ ప్రభుత్వం విడగొట్టడం అందరికి గ్లానినే మిగిల్చింది. అనుకోనంతగా మతకలహాలు చెలరేగాయి. దేశవ్యాప్తంగా లక్షల మంది ఈ కలహాలలో మరణించారు. పాకిస్థాన్లో ఉన్న హిందువులు ఆస్తులు వదిలేసుకుని, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని భారతదేశానికి వస్తే, ఇక్కడ ఉన్న ముస్లింలు పాకిస్తాన్ కి వలసపోయారు. ఆ సందర్భంగా చోటు చేసుకున్న, ధన,మాన ప్రాణాల నష్టానికి అంతే లేదు. భారతదేశం శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రాధాన్యత నిస్తే, పాకిస్థాన్ మతానికి ప్రాధాన్యత నిచ్చిన దేశం గా చరిత్రలో మిగిలిపోయింది. నాటికీ, నేటికీ ఈ దేశాలు రెంటి మధ్యా దాయాది పోరు ఉండనే ఉంటోంది. కాలక్రమేణా భారతదేశం లౌకిక వాదాన్ని సంతరించుకుంటే, పాకిస్తాన్ దేశం మత వాదాన్ని సమర్థిస్తోంది. ఇది చరిత్ర ఎరిగిన సత్యం.

★★★★★

నిబద్దత కల ప్రజా నాయకుడిగా రూపొందాడు పార్వతీశం. కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉన్న నేత అయ్యాడు. ఆ ప్రాంత ప్రజలకు అతని మాటే వేదవాక్యం. ఏ సమస్య ఉన్నా దాన్ని రూపుమాపి ప్రజల మన్నన పొందుతాడు పార్వతీశం అతని దగ్గరకు వెళితే చాలు, తమ కష్టం తీరినట్లే అని ప్రజలు భావించే స్థితికి ఎదిగారు.

ఇక నాణేనికి రెండవ వైపు కూడా ఉంది. భారత దేశం దేశ విభజన ఫలితంగా ఎన్నో రాజకీయ సమస్యలను కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. పాకిస్థాన్, చైనా వంటి దేశాలతో సరిహద్దు తగాదాలకు అప్పటినుంచే బీజం పడింది. మత కలహాలు, కుల పోరాటాలు, ప్రాంతీయ భావాలు పెచ్చు మీరి పోయాయి. అంత వరకు స్వతంత్ర పోరాటంలో ఏకమైన భారతీయుల్లో ఉన్న సంకుచిత భావాలన్నీ బయటకొచ్చి విపరీత ధోరణులతో సంచరించ నారంభించాయి.ఎటుచూసినా పేదరికం, నిరుద్యోగం, జాతి,వర్ణ విచక్షత.

ఎన్నో ఆర్థికాంశాలతో ముడిపడ్డ సమస్యలు. ఎన్నో గ్రామాలకు కరెంటు లేదు. ఎన్నో ప్రాంతాలు మంచినీళ్లకు ఇంకా చెరువుల మీదే ఆధార పడి ఉన్నాయి. ఎన్నో ఊళ్లకు వెళ్ళటానికి మట్టి రోడ్డులే గతి. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగితే ఆ గ్రామాలకు మిగిలిన ప్రపంచంతో సంబంధ బాంధవ్యాలు తెగిపోయేవి. యుద్ధానంతర పరిస్థితులలో తిండి గింజలకు కూడా ప్రజలు నానా అవస్థలు పడేవారు. సమాచార వ్యవస్థ సరిగ్గా లేదు. ఇటువంటి పరిస్థితులలో పదవిని స్వీకరించటమనేది ఒక పెద్ద గుదిబండే నాయకుడికి. వారి నించి ప్రజలెంతో ఆశిస్తారు. కానీ అప్పటికి సరైన పరిపాలనా వ్యవస్థే ఏర్పడలేదు దేశంలో. నవ్య భారతం తప్పటడుగులు వేసే సమయమది. దేశంలో తొలి చట్టసభ కూడా ఏర్పడలేదు.

## 24

**పా**ర్వతీశం కుటుంబంలో ఎన్నో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కృష్ణ సరళ అనే అమ్మాయిని చూసి ఇష్టపడ్డాడు. అతను ఆమె బీ ఎస్సీ పరీక్షలు వ్రాయటానికి తమ కాలేజీకి వచ్చినప్పుడు చూశాడు. ఆమె నచ్చి, వివరాలు కనుక్కొని ఇంట్లో చెప్పాడు, శారద ఆశల మీద నీళ్లు చల్లుతూ. పార్వతీశం, హైమవతి ఏమీ అనక పోయినా తన మరిది తన మాటను నిలబెట్టలేదని కోపం వచ్చింది శారదకు. ఆ కోపంలో తన మనసులో రాజును చేసుకోవాలనే ఆలోచన ఉన్నట్టు కృష్ణతో చెప్పనే లేదన్న సంగతి కూడా విస్మరించిందామె. కన్నతల్లిలా పెంచిన వదిన ఎందుకలా తనతో కోపంగా ఉంటోందో కృష్ణకు అర్థం కూడా కాలేదు. కేవలం తాను సరళను ఇష్టపడ్డాడని చెప్పాడు అంతే. మిగిలినదంతా పద్ధతి ప్రకారమే జరిగింది.చిన్ననాటి నుంచి తనను అల్లారు ముద్దు గా పెంచిన వదినకు తన మీద ఇంత కోపం ఎందుకు వచ్చినట్లు? తనేదో తప్పు చేసినట్లు ఆడపడుచు ముందు తల ఎత్తుకు తిరగలేక పోయింది శారద.

శారద పైన ఒక వాటా ఖాళీ చేయించి అందులోనే గృహ ప్రవేశం చేయించింది వాళ్ళతో. సరళ మనిషి స్వతహాగా మంచిదే అయినప్పటికీ, శారద తనను పెళ్ళి అయిన నాటి నించే వేరు పెట్టటంతో తోటి కోడలంటే తెలియని అయిష్టత

పెరిగింది ఆమెలో. కృష్ణ తన వదినను మాతృ సమానంగా గౌరవిస్తాడు కనుక, చదువుకున్న పిల్ల కనుక తగుమాత్రం బాంధవ్యం నిలుపుకుంటోంది సరళ శారదతో.

శారద పడే మానసిక వ్యధను గమనించిన శయనమ్మ ఆమెతో అన్నది ఒకనాడు "మీ అన్నయ్య ఆనాడు ఎంత ముందుచూపుతో పిల్లలతో పెళ్ళి మాట ఎత్తవద్దని అన్నాడో. లేకపోతే కృష్ణ చేసిన పనికి నీకు అందరి ముందు తలవంపులయ్యేది. ఇప్పుడు నువ్వింత బాధ పడటం కేవలం నీ మనసుకు సర్ది చెప్పుకోలేకపోవటం వలననే. ఆలోచించు. నువ్వు అదృష్టవంతురాలివి శారదా."నిజమే నన్నట్లు తల ఊపింది శారద. శయనమ్మ గారి అనుభవంతో కూడిన మాటలు కొంతవరకు సేద తీర్చాయి శారదను.

★★★★★

శేషు అనుకున్నట్లుగానే అతనెంతో ఇష్టపడే సైన్యంలోకి ఎంపికయ్యాడు. అతను సైన్యంలోకి వెళ్తానంటే ఇంట్లో అందరూ కదిలిపోయారు ఒక్క శారద తప్ప. చనిపోయేముందు భర్త అన్న ఒక్క మాట ఆమె మనసును కొడుకుతో బాంధవ్యం పట్ల అంత కఠినంగా మార్చింది. ఆ తల్లి మనసు ఎప్పటికైనా కరుగుతుందో లేదో ఎవరికీ అర్థం కాదు.

ఎవరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా శేషు సైన్యం లోకి చేరడానికి వెళ్ళి పోయాడు. నిజానికి బాధకంటే ఆ కుటుంబంలో వాళ్ళందరూ గర్వపడ్డారు శేషు అనుకున్నది సాధించి, దేశసేవ చెయ్యటానికి వెళ్తున్నందుకు. అందరి ఆశీస్సులతో బయల్దేరి వెళ్ళాడు శేషు. ఒక్క హైమవతి మాత్రం పెంచిన ప్రేమతో తల్లడిల్లిపోయింది కానీ ఏమీ అనలేకపోయింది.

అతన్ని శిక్షణానంతరం భారత్ పాక్ సరిహద్దులలో సేవలకు పంపింది భారత ప్రభుత్వం. అప్పటికే భారతదేశం పాకిస్థాన్ల మధ్య సరిహద్దు తగాదాలు మొదలయ్యాయి. ముస్లిం జనాభా ఎక్కువున్న కాశ్మీర్ ప్రాంతానికి హిందూ పాలకుడు ఉండటంతో జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో అప్పటికే అశాంతి నెలకొని ఉంది. కాశ్మీరును పాకిస్తానుకు, ఇండియాకు పంచిన తరువాత 1948 జనవరిలో కాల్పుల విరమణ జరిగింది. కొంత మంది ఈ సంఘటనను మొదటి కాశ్మీర్ యుద్ధమని కూడా చెప్పుకుంటారు ఈనాటికీ. ఆనాడు మొదలైన సరిహద్దు వివాదాలు ఈనాటి వరకు భారతదేశంలో శాంతికి భంగం కలిగిస్తూనే ఉన్నాయి. అధికారికంగా ప్రభుత్వం ప్రకటించే అంత పెద్ద వివాదాలు కొన్ని అయితే, అందరికీ తెలియనివి ఎన్నో జరుగుతూ ఉండటం కద్దు. అక్కడికి విధి నిర్వహణ కోసం వెళ్ళాడు శేషు.

తను క్షేమంగా చేరినట్లు చెబుతూ, ఎవ్వరినీ, ముఖ్యంగా హైమవతిని తన గురించి బెంగ పెట్టుకోవద్దని కోరాడు. వీలైనప్పుడు తనే ఉత్తరాలు వ్రాస్తుంటానని, తను ఎక్కడ ఉండేది ఇదమిత్థంగా తెలియదు కనుక ఎవరైనా ఉత్తరాలు

వ్రాసినా అవి తనకు వెంటనే అందక పోవచ్చనీ, జవాబు రాకపోతే కంగారు పడవద్దనీ ఒక ఉత్తరం వ్రాసాడు. ఆ ఉత్తరం అందరికీ ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. చిత్రమేమిటంటే శేషు గురించిన సమాచారం వినటానికి శారదమ్మ కూడా మొట్ట మొదటి సారి ఆసక్తి చూపించింది. పార్వతీశం చదివిన ఆ ఉత్తరం విన్న శారదమ్మ కళ్ళు చెమ్మగిల్లటం అందరూ గమనించారు.

## 25

**కా**లం ముందుకు పోతోంది జోడెడ్ల బండి మీద సవారి చేస్తున్నట్లు. అప్పుడే శేషు ఇల్లువిడిచి నెల దాటింది. రాజేశ్వరి కృష్ణ తన మాట నిలపలేదని శారద బాధ పడే అవసరమే లేకుండా చేసింది.

అదెలాగంటే బీఏ చదువుతున్న రాజేశ్వరి నాగరాజును ప్రేమించింది. నాగరాజు వాళ్ళ నాన్న పుట్టుకతో హరిజనుడు. వృత్తి రీత్యా క్షురకుడు. ఆ రోజుల్లో ఇళ్లకే క్షురకులని పిలిపించుకుని క్షురకర్మ చేయించుకునేవాళ్ళు. ఆ పని మీద అనేక సార్లు పార్వతీశం ఇంటికి వచ్చాడు నాగరాజు తండ్రి శ్రీనివాసులు. ఇంట్లో మగవాళ్ళకి క్షురకర్మ చేసి, గోళ్లు కత్తిరించి, ఔళ్ళు పట్టి వెళ్తుండేవాడు. వాళ్ళు ఇచ్చిన పాత బట్టలను ఆనందంగా తీసుకు వెళ్ళేవాడు. నాగరాజు తండ్రి వెంట తరచూ వారి ఇంటికి వస్తూ ఉండేవాడు. చూడబోతే రూపానికి మన్మథుడే. అంతో ఇంతో చదువుకున్నాడు కనుక అతని భాష కూడా బాగానే ఉంటుంది. ఇంటికి వచ్చినప్పుడల్లా రాజేశ్వరి వంక దొంగ చూపులు చూస్తుండేవాడు. అతనికి ఆ అమ్మాయి ముట్టుకుంటే మాసిపోతుందేమో అనిపించే శరీర ఛాయతో చాలా అపురూపంగా అనిపిస్తుండేది. సుశీలతో, భారతితో కాలం గడిపే రాజేశ్వరి మీద మనసు పడ్డాడతను. ప్రైవేటుగా మెట్రిక్కు కట్టి డింకీలు కొడుతూ ఏళ్ళు గడుపుతున్న అతను, చేసేందుకు వేరే పనేమీ లేక రాజేశ్వరి వెంట పడసాగాడు. కారణం ఆకర్షణ, ఆ వయసులో ఉండే తుంటరితనం అంతే. అది ప్రేమా అంటే సందేహమే!

రాజేశ్వరి వయసులో ఉన్న ఆడపిల్లలకు ఒక మగవాడు వారి దృష్టిలో పడటానికి నానా తిప్పలు పడుతుంటే గొప్పగా ఉంటుంది. పైగా లోక జ్ఞానం అట్టే లేని రాజేశ్వరికి మరీనూ. ఆమె నాగరాజుని హృదయపూర్వకంగా ప్రేమించి మనసులోనే ఆరాధించేది.ఇంట్లో అందరూ చదవమన్నారని రాజేశ్వరి చదువుతోంది కానీ ఆమెకు చదువు మీద పెద్దగా ఆసక్తి లేదు. పార్వతీశం గారు రాజేశ్వరిని కాలేజీకి దింపి తేవడానికి ఒక రిక్షా వాడుకగా మాట్లాడారు. రాజేశ్వరి అందులోనే కాలేజీకి వెళ్ళి వస్తుండేది.

ఆ సమయంలో నాగరాజు తన స్నేహితుడి నుంచి అడిగి తెచ్చుకున్న సైకిల్ తో ఆమె వెళ్ళే సైకిల్ రిక్షాను రయ్యి మని దాటి వెళ్ళి సందు చివర ఆగేవాడు. అక్కడనించి ఆమెను అదే పనిగా చూస్తుండేవాడు. ఆమె ఉన్న రిక్షా తనను దాటి కొంత దూరం పోగానే మళ్ళీ అలానే చేసేవాడు. రాజేశ్వరికి ఆ విన్యాసాలన్నీ తన కోసమే అని తెలిసి గర్వంగా అనిపించేది.

అతని సైకిల్ తన రిక్షా వెనకాల వస్తోందని తెలిసినప్పుడు ఆమె గుండె అదోలాంటి ఉద్వేగంతో దడదడ లాడేది. అతనో రోజు రాకపోతే అదే గుండె నీరస పడేది. అతను తనను దాటి వెళ్లిన దగ్గిర నుండి మళ్ళీ కనిపించేవరకు కళ్ళు అతన్ని వెతుక్కునేవి. ఇలా విధీ విరామమూ లేకుండా దగ్గర దగ్గర సంవత్సర కాలం ఆమె వెంట తిరిగాడు నాగరాజు.

నిజానికి అలా తిరగటం వలన ఉపయోగ మేమిటో నాగరాజుకీ తెలియదు. అదో సరదా, అదో కాలక్షేపం అతనికి అంతే. రాజేశ్వరి తనని ప్రేమిస్తోందన్నది అతని ఊహ కందని విషయం. నిజం చెప్పాలంటే రాజేశ్వరిని ప్రేమించేంత ధైర్యం అతనికి లేదనే చెప్పాలి. ఎందుకంటే తమ మధ్య ఉన్న అంతస్తుల భేదం అతనికి తెలుసు. కానీ రోజు పొద్దున్న, సాయంత్రం రాజేశ్వరిని చూడందే అతనికి తోచేది కాదు.

చదువైపోయిన వెంటనే రాజేశ్వరికి పెళ్ళి చెయ్యాలని అనుకున్నారు ఇంట్లో వాళ్ళు. ఎటు తిరిగీ పరీక్షలయ్యాక ఇంకో మూడు నెలలలో ఫలితాలు. ఆ ఫలితాలు వచ్చే వరకు పెళ్ళికి ఎందుకు ఆగాలి? ఇప్పటి నించి సంబంధాలు చూస్తే పరీక్ష లవగానే ముడి పెట్టెయ్యొచ్చు.

పెళ్ళి సంబంధాలు కుదిర్చే సుబ్బయ్య శాస్త్రిని పిలిపించి తమ కూతురికి తగిన సంబంధం చూడమని దక్షిణ, తాంబూలమిచ్చి తండ్రి చెప్పటం రాజేశ్వరి చూసింది. ఆమె మనసు నాగరాజు మీద లగ్నమై ఉంది. వేరే వారిని పెళ్ళి చేసుకోవటం అసాధ్యమని అనుకుంది. అతన్ని పెళ్ళి చేసుకుంటే తమది కులాంతర వివాహం అవుతుంది. నాగరాజు వాళ్ళు స్థితిపరులు కారు. అంటే కాక నాగరాజుకు సంపాదన లేదు. అది ఆమెకు తెలుసు. మరి ఏం చెయ్యాలి? ఆమె మనసు నాగరాజు వైపే మొగ్గింది. అదే ప్రేమ ప్రభావం.

మర్నాడు నాగరాజు తన రిక్షా వెంట వస్తున్నప్పుడు రాజేశ్వరి ఒక చిన్న చీటీ మీద "నీతో వెంటనే మాట్లాడాలి, రేపు పొన్నూరు లో జాతరకు రా" అని రాసి ఆ చీటీని రిక్షా అతను చూడకుండా, నాగరాజుకు అందించింది. అతనికి ఏమీ అర్థం కాలేదు. ముందుకు వెళ్ళి చెట్టుకింద ఆగి ఆ చీటీ చదువుకున్న అతని ఆనందానికి హద్దుల్లేవు. ఆమె రిక్షా తనను సమీపించగానే సరే నన్నట్లు తల ఊపి ఈల వేసుకుంటూ, గాలిలో తేలుతూ ఇంటికి వెళ్ళి పోయాడు.

రాజేశ్వరి ప్రేమ మైకంలో ఉంది. ప్రేమ గుడ్డిదని ఊరికే అన్నారా పెద్దలు?

ఆ రోజు రాత్రి హైమవతి దగ్గర చేరి మర్నాడు పొన్నూరు జాతరకు వెళ్తానని అడిగింది రాజేశ్వరి. ఆ ఇంట్లో ఆడపిల్లలకు స్వేచ్ఛ ఎక్కువ. పైగా రాజేశ్వరి మీద ఏమాత్రం అనుమానం లేదు హైమవతికి. అదీకాక పెద్దకూతురంటే పిచ్చి ప్రేమ.

అక్కడికీ అన్నయ్యని తోడుగా తీసుకుని వెళ్ళమంది. సరే నంది రాజేశ్వరి. తనేం చేస్తోందో తెలియట్లేదు రాజేశ్వరికి. తండ్రి ఇచ్చిన స్వేచ్ఛను పూర్తిగా దుర్వినియోగం చేసుకుంటోంది. పక్కన భారతి కనుక ఉంటే అటువంటి పని చేయనిచ్చేది కాదు. ప్రతిదీ చెల్లెలితో పంచుకునే రాజేశ్వరి, నాగరాజు విషయాన్ని మటుకు ఆమె నుంచి పూర్తిగా దాచింది.

భారతిని "నువ్వూ వెళ్తావటే అక్కయ్యతో" అని అడిగింది హైమవతి. మర్నాడు శయనమ్మగారితో కలిసి అందరిల్లులో కొత్తగా ఎవరో వదిలేసి వెళ్లిన బాబుకి, మశూచి టీకా వేయించే పని ఉండటంతో వెళ్ళనంది భారతి. రాజేశ్వరి "అమ్మయ్య "అనుకొని ఓ నిట్టూర్పు విడిచింది. భారతి కన్ను కప్పటం కష్టం.

మర్నాడు పొద్దున్నే చక్కగా తయారయ్యి ముకుందంతో కలిసి జాతరకు వెళ్ళింది రాజేశ్వరి. నాగరాజు అక్కడ రాముల వారి గుడి దగ్గర ఎదురు చూస్తుంటానని చెప్పాడు ఆమెకు. ఇచ్చిన మాట ప్రకారం అప్పటికే అక్కడకు వచ్చేసాడు కూడా. అన్నయ్యను తప్పించుకుని రాములవారి గుడికి ఎలా వెళ్ళాలా అని ఆలోచించింది రాజేశ్వరి. ఆమెకు ఒక ఆలోచన తట్టింది.

"అన్నయ్యా, వచ్చేప్పుడు అత్తయ్య సీతమ్మవారికి రవికల గుడ్డ, పసుపు కుంకుమ లివ్వమని చెప్పింది. తేవటం మర్చిపోయాను. కొనుక్కొస్తావా సాంబయ్య కొట్టు నించి. నేను ఇక్కడే ఉంటాను, ఈ లోగా సోడా తాగుతాను, దాహంగా ఉంది" అంది. సరేనని వెళ్ళాడు ముకుందం. ఒక్క పరుగున గుడి ముందున్న నాగరాజు దగ్గరకు వెళ్ళింది రాజేశ్వరి.

"నాగరాజూ, మా నాన్నగారు నాకు వేరే సంబంధాలు చూస్తున్నారు. మనం వెంటనే పెళ్ళి చేసుకోవాలి" అంది. ఈమాటలు నాగరాజు అస్సలు ఊహించనివి. పెద్దింటి అమ్మాయి తనతో మాట్లాడా లనటమే చాలా గొప్పగా అనుకున్నాడతను. రాజేశ్వరి తనతో మాట్లాడాలని అన్నదని చెప్పేసరికే, స్నేహితుల్లో అతని స్థాయి అమాంతం పెరిగి పోయింది. నిజానికి ఆమె వస్తుందనే అనుకోలేదతను.

అలాంటిది రాజేశ్వరి పెళ్ళి మాట ఎత్తేసరికి అతని తల తిరిగి పోయింది. ఏం జవాబివ్వాలో కూడా అర్థం కాలేదు. రాజేశ్వరి అతని సమాధానం కోసం ఎదురు చూస్తుండగానే దూరాన్నుంచి ముకుందం గుడికేసి రావటం గమనించాడు నాగరాజు.

"మళ్ళీ కలుద్దాం. మీ అన్నయ్య వస్తున్నాడు" అంటూనే జనంలో కలిసి పోయాడు. రాజేశ్వరి బిత్తరపోయింది. ఇంత సాహసించి తాను జాతరకు వచ్చి లాభమేంటి?

ముకుందం "సోడా తాగుతానన్నావు కదమ్మా? ఇక్కడికి వచ్చావేమిటి?" ఆరాగా అడిగాడు. నాగరాజు అక్కడ్నించి తప్పుకోవటం అతని దృష్టిని దాటి పోలేదు

"గుడిలో జనం ఎలా ఉన్నారో చూసి వస్తున్నా నన్నయ్యా" అంది రాజేశ్వరి.

"పద ఎక్కువ జనం లేరులే." ఆమెతో సహా గుడివైపు నడిచాడు ముకుందం.

★★★★★

ఆ రోజు రాత్రి డాబా మీద పడుకున్నారు ముకుందం, మురారి, రవి, ప్రసాద్. మేఘాలతో దోబూచులాడుతున్న చందమామను చూసి నవ్వుకున్నాడు రవి. అది గమనించిన మురారి అడిగాడు.

"ఏరా రవీ, ఆ నవ్వు దేనికి?"

"చిన్నప్పుడు వదిన మాకు అన్నం తినిపిస్తూ గొడవ చెయ్యకుండా అన్నం తింటే చందమామ మా ఇంటికి వస్తాడనేది. అందరం పోటీలు పడి తినేవాళ్ళం." అంతా నవ్వారు.

"అన్నయ్యా, నాతో ఏం అనేదో తెలుసా? 'నువ్వు చిన్న బాబువి కదా, ఈ పెద్ద ముద్ద తినలేవు, ఇది రవికి పెడతాలే. నీకో చిన్న ముద్ద చేసి పెడతా' అని. నాకు రోషం వచ్చేది. 'నేనూ పెద్ద ముద్ద తినగలను. పెట్టు' అని నోరు తెరిచేవాడిని. ఒక ముద్ద పెట్టేది. తరవాత 'ఒక ముద్ద ఏదో తిన్నావులే, రెండవది నీ వల్ల కాదు' అనేది. నేను ఇంకా పెద్దగా నోరు తెరిచేవాడిని. ఇట్లా మాయ చేస్తూ అన్నం మొత్తం పెట్టేది." పక పక నవ్వాడు ప్రసాద్.

మురారి అన్నాడు "అత్తయ్య మీ వదిన కాదురా, అమ్మే. ఎంత ప్రేమగా చూస్తుంది మిమ్మల్ని? ఆ మాట కొస్తే మమ్మల్ని కూడా."

"నిజం. ఈ మధ్య ముభావంగా ఉంటోంది కానీ చిన్నప్పుడు ఎన్ని కథలు చెప్పేదీ, ఎన్ని కబుర్లు చెప్పేదీ! మొన్న అక్కయ్య చెప్పింది. పెద్దన్నయ్య పోయినప్పుడు వాళ్ళ అమ్మా నాన్నలు వాళ్ళతో వచ్చెయ్యమంటే 'నా మరుదులు నాకు కొడుకులతో సమానం. నా భర్త పోయేటప్పుడు వీళ్ళని పెంచి పెద్ద చేస్తానని మాట ఇచ్చాను. నేను మీతో రాను' అందిట. ఆమె అడిగితే నా గుండె తీసి తన చేతుల్లో పెట్టైనా అమ్మ లేని లోటు తెలియకుండా పెంచిన ఋణం తీర్చుకుంటాను." ఉద్వేగంగా అన్నాడు రవి.

"నిజంరా, కృష్ణ మావయ్య పెళ్ళి విషయంలో అత్తయ్యకి ఎందుకంత కోపం వచ్చిందో అసలు?" అన్నాడు మురారి

"తెలియదు కానీ అప్పటినించే తను మారి పోయింది. అయినా పెద్దవాళ్ళని నొప్పించి చేసుకునే పెళ్ళిళ్ళ వలన ఏం ఒరుగుతుందిరా? నేనైతే వాళ్ళు చూసే పిల్లనే చేసుకుంటాను."అన్నాడు రవి. వింటున్న ముకుందం మనసులో పొద్దున్న జరిగిన సంఘటన మెదిలింది ఎందుకో.

"ఒరేయ్, ఇవాళ పొన్నూరు లో నాగరాజుని చూసానురా."

"వాడూ జాతరకు వచ్చాడా ఏమిటీ? "మురారి అడిగాడు.

"నా కలా అనిపించలేదు. జాతర కొస్తే నన్ను చూసి పారిపోవలసిన అవసరం ఏమిటి? పలకరించవచ్చుగా! మన రాజేశ్వరితో మాట్లాడాడని నా అనుమానం." ఆరోజు పొద్దున్న జరిగిన దానిని వివరంగా చెప్పి అన్నాడు ముకుందం.

"నాకెందుకో వాడి తీరు అనుమానంగా తోచింది. నన్ను చూసి తొట్రుపడుతూ అక్కడనించి వెళ్ళి పోయాడు. నేను వాడిని చూశానని వాడికి తెలియదు" వింటున్నవారి మనస్సులో ఆవేశం నిండింది.

"రేపోసారి మనం వెళ్ళి వాడిని హెచ్చరించి వద్దాం అక్క జోలికి వస్తే ఊరుకోమని." ఆవేశంగా అన్నాడు మురారి. అందరూ అందుకు అంగీకరించినట్లు తల ఊపారు.

★★★★★

మర్నాడు నలుగురూ కలిసి నాగరాజు కోసం మాటు వేశారు. సాయంకాలం వేళ ఊరి వెలుపల ఉన్న ఇంటికి వెళుతూ వాళ్ళ కంటపడ్డాడు నాగరాజు. దారికాచి అతన్ని ఆపారు.

"ఏంట్రా, నిన్న పొన్నూరు గుడి దగ్గర ఎవరితోనో మాట్లాడుతున్నావు?" మురారి నాగరాజు కాలర్ పట్టుకుని అడిగాడు. ముకుందం తనని చూశాడని నాగరాజుకు అర్థమైపోయింది. ఇక దబాయించి ప్రయోజనం లేదనుకున్నాడు. పైగా మురారి అడిగిన తీరు అతనికి నచ్చలేదు.

"నాకు కాబోయే పెళ్ళాంతో" పొగరుగా జవాబిచ్చాడు. లాగి పెట్టి అతన్ని ఒక్కటి కొట్టాడు ముకుందం.

"ఆమె ఎవరో తెలుసా?"

"తెలుసు. నీ చెల్లెలు, పార్వతీశం గారి పెద్దమ్మాయి." అయితే ఏంటి అన్నట్టు అడిగాడు నాగరాజు.

"ఆ మాట తెలిసీ ఆమె వెంట పడుతున్నావా?" మురారి ఓ తన్ను తన్నాడు అతన్ని. నాగరాజు బుస కొట్టాడు.

"మేము ప్రేమించుకుంటున్నాము. నేను తనను పెళ్ళి చేసుకుంటాను" ఈసారి కొట్టటం ముకుందం వంతు అయ్యింది.

"ఇక ఆ మాట మరచిపో. మరోసారి ఆమెను కన్నెత్తి చూశావా, మక్కెలు విరగ కొడతాము." ప్రసాద్ హెచ్చరించాడు నాగరాజుని. అందరూ కలిసి తనని ఒంటరిని చేసి అలా తన్నటంతో రోషం పొడుచుకు వచ్చింది నాగరాజుకు. ఆఖరికి చిన్న వాడైన ప్రసాద్ కూడా! అప్పటి వరకు రాజేశ్వరిని పెళ్లాడాలని నిర్ణయించుకోని అతను, ఆ నిమిషంలో ఎలాగైనా ఆమెను పెళ్ళి చేసుకుని వీళ్ళందరికీ బుద్ధి చెప్పాలనే నిర్ణయానికి వచ్చాడు. కింద పడిన అతనికి చెయ్యిచ్చి లేపి అతని చొక్కాకి అంటిన మట్టిని దులిపాడు ముకుందం.

"రాజు అల్లారుముద్దుగా పెరిగింది నాగరాజూ, అయిందేదో అయ్యింది. మేమూ ఆవేశపడ్డాం. ఏమీ అనుకోకు. ఈ విషయం ఇంతటితో వదిలేద్దాం. నువ్వు రాజు జోలికి రాకు, దాన్ని మర్చిపో. మేమూ నీ జోలికి రాము. పదండిరా పోదాం." వెనక్కి తిరిగాడు ముకుందం. అందరూ అతన్ని అనుసరించారు.

★★★★★

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS